## క్లుప్తంగా

### వినాయక చవితి ఉత్సవాలకు పందిరి రాట



చిల్లపేటలో ఉత్సవరాట కార్యక్రమంలో భక్తులు

**తగరపువలస:** జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు చిల్లపేటలో వినాయక చవితి ఉత్సవాలకు సోమవారం పందిరి రాట వేశారు. శ్రీసిగడాం మహాలక్ష్మి యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, నీలాపు సురేష్, నీలాపు శంకర్‌రెడ్డి, చిల్ల ఆదినారాయణరెడ్డి, చిల్ల సూరినరసయ్యరెడ్డి, చిల్ల సూరిబాబు, చిల్ల రాము, సరగడ వీరుబాబు, ఉప్పాడ దేవ తదితరులు పాల్గొన్నారు.

### బుద్ధ విగ్రహం ప్రతిష్ట



సంతపేట రామాలయంలో బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న స్థానికులు

**తగరపువలస:** జీవీఎంసీ రెండో వార్డు రెడ్డిపేట సంతపేట పురాతన సీతారామాలయంలో సోమవారం రూ.1.20 లక్షల విలువైన బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు ఇంజె వరలక్ష్మి, వీర వెంకట సత్యనారాయణ దంపతుల సాయంతో ఈ విగ్రహం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, చేట్ల రామిరెడ్డి, చేట్ల ఎర్రయ్యరెడ్డి, చిన్నారెడ్డి, జగన్నాథ ఈశ్వరరావు, అత్తిలి రఘు తదితరులు పాల్గొన్నారు.

### విశ్రాంత ఉపాధ్యాయురాలు మృతి



కమలమ్మ (ఫైల్)

**తగరపువలస:** జీవీఎంసీ 1వ వార్డు కొండపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు గండి కమలమ్మ వృద్ధాప్యం కారణంగా సోమవారం మృతి చెందారు. ఆమె 1974 నుంచి మూడేళ్లపాటు చెరకుపల్లిలో, 1977 నుంచి 2007 వరకు కొండపేటలోని సీబీఎం ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ఆమె అంత్యక్రియలు మంగళవారం ఆంధ్రా బాప్టిస్ట్ సంఘం శ్మశానవాటికలో నిర్వహించనున్నారు.

### మహిళ అదృశ్యం



రామలక్ష్మి

**పద్మనాభం:** మండలంలోని శేరిఖండంలో ఒక మహిళ అదృశ్యమైనట్టు సీఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపారు. సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం వాడాడ గ్రామానికి చెందిన రామవరపు రామలక్ష్మి తన సోదరుడు తిరురెడ్డి నవీన్‌తో కలిసి 15 రోజుల క్రితం శేరిఖండంలో ఉన్న అమ్మమ్మ గారింటికి వచ్చింది. ఈ నెల రెండు నుంచి రామలక్ష్మి కనిపించలేదు. దీనిపై సోదరుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

### వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**తగరపువలస:** భీమిలి మండల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు ఈ నెల 5 నుంచి 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో పి.వెంకటరమణ తెలిపారు. ఈ నెల 4వ తేదీ నాటికి 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి, పదో తరగతి ఉత్తీర్ణత, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 8న దరఖాస్తుల పరిశీలన, 11న ఇంటర్వ్యూలు, 13న పోస్టింగ్ ఇవ్వనున్నామని తెలిపారు. పెద నాగమయ్యపాలెంలో మూడు, మూలకుద్దు, తాటితూరులో ఒక్కో వలంటీర్ పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.



# తాగునీటి సమస్య పరిష్కరించాలి

**'స్పందన'లో జోన్ – 2 జెడ్సీకి స్వయంకృషినగర్ వాసుల వినతి**



తాగునీటి సమస్యపై జెడ్సీకి వివరిస్తున్న స్వయంకృషినగర్ వాసులు

**మధురవాడ:** జీవీఎంసీ 5వ వార్డు స్వయంకృషి నగర్ పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని శ్రీ సాయి స్వయంకృషి సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళలు స్పందనలో ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటికే సమస్య పరిష్కారం కోసం అంచనాలు రూపొందించినట్టు వాటర్ వర్క్స్ డీఈ శ్రీహరి చెప్పారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో జెడ్సీ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జీవీఎంసీ 5 నుంచి 13 వరకు గల 9 వార్డుల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ వర్క్స్, విద్యుత్, తాగునీరు, రెవెన్యూ విభాగాలకు మొత్తంగా 9 అర్జీలు వచ్చాయి. జీవీఎంసీ 7వ వార్డు మిధిలాపురి వుడా కాలనీ షిప్‌యార్డు లే అవుట్‌లో వుడా ఫ్లాట్ నంబర్ 24/94, సర్వే నంబర్ 281/8, 9, 10 సబ్ డివిజన్లలో గల 81 సెంట్ల పార్కు స్థలంలో ఉన్న రెండు అనధికార షెడ్లు తొలగించాలని డిమాండ్ చేశారు. ఇదే సమస్యపై ఏళ్ల తరబడి తిరుగుతున్నామని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోమన్నా స్థానిక సిబ్బంది తాత్సారం చేస్తున్నారని కాలనీవాసులు వాపోయారు. బక్కన్నపాలెం 44వ వార్డు సచివాలయం పరిధిలో డ్రైయిన్స్‌కు మరమ్మతులు చేపట్టాలని ఎస్.చిన్నకృష్ణంరాజు కోరారు. వినతులు పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

**భీమునిపట్నం:** భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు రెండు వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి వినతులు వచ్చాయని, పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జెడ్సీ తెలిపారు.

**అన్నవరం సమస్యలపై ఫిర్యాదు**

**తగరపువలస:** భీమిలి మండలం అన్నవరం పంచాయతీలోని పలు సమస్యలపై అదే పంచాయతీకి చెందిన చల్లపల్లి గణేష్ సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశాడు. పారిశుధ్యం, తాగునీరు, సముద్రపు ఇసుక రవాణా, రక్షిత మంచినీటి పథకాల శుభ్రతపై గత నెల 14న కూడా స్పందనతోపాటు జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశాడు. సమస్యలు పరిష్కరించే వరకూ ఫిర్యాదులు చేస్తామని తెలిపారు.

## కొత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



ఖర్జూరం, చెర్రీ, తులసి మాలల అలంకరణలో కొత్తమ్మతల్లి

**తగరపువలస:** జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని సోమవారం సాయంత్రం 25 కిలోల ఎండు ఖర్జూరం, 25 కిలోల చెర్రీ (వాక్కాయ), 150 మూరల తులసిమాలలతో అలంకరించారు. మంగళవారం ఈ ప్రత్యేక అలంకరణతో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో ఈ అలంకరణకు భీమిలి మండలం తాళ్లవలసకు చెందిన కె.సోమేశ్వరరావు, బుచ్చిబాబు సహాయ సహకారాలు అందించారు. అమ్మవారిని చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన ఈశ్వరరావు అలంకరించారు. కొత్తపేటకు చెందిన జోగ అప్పారావు, కృష్ణవేణి దంపతులు సోమవారం అమ్మవారికి పట్టుచీర, అలంకరణ వస్తువులు బహూకరించారు.

## సత్రం స్థలానికి వేలం ఖరారు



వేలం పాటలో పాల్గొన్న అధికారులు

**భీమునిపట్నం:** భీమిలి చిన్నబజారు ప్రాంతంలోని గంధం రామస్వామి సత్రం స్థలానికి సంబంధించిన వేలం పాట ఖరారయ్యింది. ఇక్కడ ఉన్న 14 సెంట్ల సత్రం స్థలానికి దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష ఆధ్వర్యంలో బహిరంగ వేలం సోమవారం ఉదయం నిర్వహించారు. గిడితూరి వెంకట సుజాత అనే మహిళ 11 సంవత్సరాల వరకు నెలకు రూ.25,600 చెల్లించడానికి వేలం పాడారు. కార్యక్రమంలో నూకాలమ్మవారి గ్రూప్ దేవాలయాల ఈవో బి.మురళీమోహన్, తనిఖీదారు బి.వసంత కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నష్ట పరిహారం కోరుతూ రైతుల ఆందోళన



పద్మనాభం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతులు

**పద్మనాభం:** మండలంలోని తునివలస పంచాయతీ నరసాపురం గ్రామానికి చెందిన రైతులు ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన తమకు నష్ట పరిహారం చెల్లించాలని పద్మనాభం తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన చేశారు. భూములు తీసుకుని మూడేళ్లు అయినప్పటికీ పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ శ్రీవల్లిని కార్యాలయంలోకి వెళ్లనివ్వకుండా బైఠాయించారు. పోలీసులు రంగం ప్రవేశం చేసి సీఐటీయూ భీమునిపట్నం డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి, 11 మంది రైతులను అరెస్ట్ చేశారు. అనంతరం విడుదల చేశారు.

## అక్రమ నిర్మాణం తొలగింపు



నిర్మాణాన్ని కూల్చివేస్తున్న అధికారులు

**కొమ్మాది:** జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో సర్వే నంబర్ 314 ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా నిర్మించిన అక్రమ భవనాన్ని తహసీల్దార్ వేణుగోపాల్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సోమవారం సాయంత్రం కూల్చివేశారు. గతంలో రెండుసార్లు నిర్మించినప్పుడు కూల్చివేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, మరలా హెచ్చరిక బోర్డులు ఉన్నప్పటికీ నిర్మాణం చేపట్టడంతో కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణంపై స్థానికులు స్పందనలో జేసీ విశ్వనాథంకు ఫిర్యాదు చేశారని, ఆయన ఆదేశాల మేరకు తొలగించినట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఇదిలా ఉండగా స్థానిక సొసైటీ కోసం నిర్మించిన సామాజిక భవనమని గ్రామ పెద్దలు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయ ఆహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

**పద్మనాభం:** ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులందరూ ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సూచించారు. ప్రకృతి వ్యవసాయం సాగులో పద్మనాభాన్ని మోడల్ మండలంగా ఎంపిక చేయడంతో వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీవోఏలు, ఐసీఆర్పీలకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆరగించడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ సాగు విధానంపై ప్రతి ఒక్కరూ ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఎ.మోహన్‌రావు, రీజినల్ అధికారి హేమ సుందర్, అసిస్టెంట్ డీపీఎం స్వామినాయుడు, మండల పాయింట్ ఇన్‌చార్జి ఎం.అప్పలనాయుడు, ఎన్ఎఫ్ఏ గణేష్ పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ వేషధారణ పోటీలకు ఆహ్వానం

**తగరపువలస:** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి బాలగోకులం పేరుతో శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించనున్నారు. ఆనందపురం మండలం గుడిలోవ శ్రీసరస్వతి విద్యావిహార్, తగరపువలస ప్రముఖులు సంయుక్తంగా ఈ పోటీలు మూడు విభాగాలుగా నిర్వహించనున్నారు. మొదటి విభాగంలో అయిదేళ్ల లోపు చిన్నారులకు కేవలం వేషధారణ, రెండో విభాగంలో 6 నుంచి 8 ఏళ్ల చిన్నారులకు వేషధారణ, పద్యం/శ్లోకం/వచనం, మూడో విభాగంలో 9 నుంచి 12 ఏళ్ల చిన్నారులకు వేషధారణ, పద్యం/శ్లోకం/వచన పోటీలు ఉంటాయి. పోటీలకు గంట ముందు పేర్లు నమోదు చేసుకోవాలి. పోటీదారులు సొంతంగా మేకప్ సమకూర్చుకోవాలి. వివరాలకు 94945 75622, 94412 60504, 95020 96218లో సంప్రదించాలని కోరారు.

## విద్యార్థులకు హాల్ టిక్కెట్ల పంపిణీ



హాల్ టిక్కెట్లతో విద్యార్థులు, నిర్వాహకులు

**తగరపువలస:** దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో ఈ నెల 9, 10న నిర్వహించే హయ్యర్, లోయర్ పరీక్షలకు సంబంధించి సోమవారం 60 మంది విద్యార్థులు హాల్ టిక్కెట్లు తీసుకున్నారు. వీరికి హాల్ టిక్కెట్లను భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కాళ్ల సూర్య రామకృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పంపిణీ చేశారు. హాల్ టిక్కెట్లు తీసుకోని విద్యార్థులు ఈ నెల 8లోగా తీసుకోవాలని సూచించారు. వివరాలకు 89858 97419, 89856 47419లో సంప్రదించాలని సూచించారు.

## బోని ఉప సర్పంచ్‌గా అరుణకుమారి



అరుణ కుమారికి ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

**ఆనందపురం :** మండలంలోని బోని పంచాయతీలో ఖాళీ ఏర్పడిన ఉప సర్పంచ్ పదవికి సోమవారం ఎన్నిక నిర్వహించారు. ఈ మేరకు మెజారిటీ సభ్యులు 1వ వార్డు సభ్యురాలు ఎర్నింటి అరుణకుమారికి మద్దతు తెలపడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి గంగరాజు ప్రకటించారు. గతంలో ఇక్కడ ఉప సర్పంచ్‌గా 5వ వార్డు సభ్యురాలు మద్దిల దేవి పనిచేశారు. కాగా ఆమె మూడు నెలలు క్రితం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఉప సర్పంచ్ ఎన్నిక కోసం సభ్యులతో సమావేశం నిర్వహించగా సర్పంచ్ బోని అప్పలకొండతోపాటు ఎనిమిది మంది సభ్యులకు ఆరుగురు హాజరయ్యారు.

కోరం సరిపోవడంతో మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు అరుణ కుమారి ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్టు ప్రకటించారు. కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, బోని సన్యాసినాయుడు, కార్యదర్శి నారాయణ రావు పాల్గొన్నారు.

## గీతంలో పండగోత్సవాలు

**కొమ్మాది:** ఓనంతోపాటు శ్రావణమాసం, శ్రీ కృష్ణాష్టమి సందడి ప్రారంభం కావడంతో గీతం విశ్వవిద్యాలయంలో వివిధ రాష్ట్రాల విద్యార్థులు ఆయా పండగలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో సోమవారం సంప్రదాయ వేషధారణ, శ్రీకృష్ణాష్టమి వేడుకలు, రంగవల్లి పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు.

## మారుపేర్ల కార్మికుల సమస్యపై 'చలో విజయవాడ'



కాంగ్రెస్ కార్మిక సంఘం కార్యాలయంలో అఖిలపక్ష సంఘాల నాయకులు

**తగరపువలస:** చిట్టివలస జ్యూట్‌మిల్లులో మారుపేర్ల కార్మికుల సమస్యపై చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టాలని మిల్లు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు తీర్మానించారు. స్థానిక కాంగ్రెస్ కార్మిక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. ఈ ఏడాది ఆగస్టులో జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో పీఎఫ్ అధికారులతో జరిగిన చర్చలను వివరించారు. దరఖాస్తు చేసుకున్న 274 మంది కార్మికుల సొమ్ము విడుదలకు యాజమాన్యం నుంచి వివరాలతో పీఎఫ్ ట్రస్ట్ బోర్డుకు పంపించామన్నారు. అలాగే పదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన నూతన బదిలీ కార్మికులు వేరే సంస్థలో చేరినట్టయితే ఆ సంస్థ పీఎఫ్‌కు లింక్ చేసుకుంటే పెన్షన్‌కు అర్హులవుతారన్నారు. లేదా 10సి ఫారంతో కూడా దరఖాస్తు చేస్తే పీఎఫ్ బకాయిలు వస్తాయన్నారు. 10డి ఫారాలపై యాజమాన్య ప్రతినిధి లలిత్ మోహన్ సంతకాలు చేయించి పీఎఫ్ కార్యాలయానికి పంపించే ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షుడు జీరు వెంకట కైలాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మునకాల ఆదినారాయణ, ఎం.దేవుళ్లు, కానూరి రాంబాబు, దల్లి అప్పలరెడ్డి, గొండేల అప్పారావు, తమ్మిన కూర్మారావు, సరగడ ఈశ్వరరావు, నరవ రామారావు, గిడిజాల రమణ, గొలగాని రాము, బోర రామారావు, కొల్లి ఎర్రయ్యరెడ్డి, కర్రోతు వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా అవార్డులు

- ఆంగ్ల మాధ్యమం బోధనలో ఎంపిక



కాళ్ల గోపీనాథ్



మట్టా చంద్రశేఖర్

**ఆనందపురం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టిన ఆంగ్ల మాధ్యమంలో ఉత్తమ బోధనలో ప్రతిభ కనబరిచిన మండలంలోని రెండు ఉన్నత పాఠశాలలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా అవార్డులకు ఎంపికయ్యారు. కాళ్ల గోపీనాథ్ మండలంలోని శిర్లపాలెం ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పాఠ్యాంశాలను ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులకు బోధిస్తున్నారు. ఆయన ఇటీవల పద్మనాభం ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వచ్చారు. అలాగే మండలంలోని రామవరం ఉన్నత పాఠశాలలో 2015 నుంచి సామాన్య శాస్త్రం ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న మట్టా చంద్రశేఖర్ ఆంగ్లంలో బోధిస్తున్నారు. ఈ మేరకు వారు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవార్డు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలన్న బాధ్యతను మరింత పెంచిందన్నారు. అలాగే ఆనందపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ, గొట్టిపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రుత్తల సన్యాసిరావు, గిడిజాల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎల్ఎస్ఎన్ పాత్రుడు జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు వారు మంగళవారం ఏయూ స్నాతకోత్సవ మందిరంలో నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో పురస్కారాలు అందుకోనున్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



భాస్కర్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ యూనియన్ సభ్యులు



చరణ్, జ్యోతి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

**భీమునిపట్నం:** భీమిలికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు నిమ్మకాయల భాస్కర్‌ను సోమవారం సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేటు టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పిఠాపురంలో జరిగిన కార్యక్రమంలో పీఎంపాలెం బేతని పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న భాస్కర్‌ను విశాఖ జిల్లా తరపున ఎంపిక చేశారు. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్షుడు అంబేడ్కర్ ఆధ్వర్యంలో సభ్యులు సత్కరించారు.

**మధురవాడకు చెందిన చరణ్, జ్యోతిలకు...**

**మధురవాడ:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మధురవాడలోని ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న దంపతులు సింహాద్రి శ్రీ నాగజ్యోతి, ఎన్ఐఎస్ కోచ్ ఐ.చరణ్‌కు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు లభించాయి.

సమైఖ్య ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రకటించిన అవార్డుల్లో విశాఖ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డును నాగజ్యోతి, ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుని అవార్డు చరణ్ కైవసం చేసుకున్నారు. వీరికి గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ లా కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో సంస్థ ఫౌండర్ డాక్టర్ నాగయ్య, ఎమ్మెల్సీ లక్ష్మణరావు పురస్కారాలు అందజేసి, ఘనంగా సత్కరించారు.

## డంపింగ్ యార్డులా గంభీరం రిజర్వాయర్ గెడ్డ



గంభీరం గెడ్డలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

**ఆనందపురం :** మండలంలోని గంభీరం గెడ్డలో విచ్చలవిడిగా చెత్త, వ్యర్థాలు పడేయడంతో డంపింగ్ యార్డుగా మారుతోంది. దీనివల్ల గంభీరం గెడ్డలోని నీరు కూడా కలుషితమవుతోంది. గంభీరం రిజర్వాయర్ నుంచి ప్రవహించే నీరు కాపులుప్పాడ మీదుగా సముద్రం వరకూ ప్రవహిస్తోంది. కాగా ఈ గెడ్డ నీటిని వ్యవసాయ అవసరాలతోపాటు పశువులకు కూడా వినియోగిస్తారు. గంభీరం గెడ్డను ఆనుకొని ఎస్సీ కాలనీతోపాటు, కొన్ని విద్యా సంస్థలు ఉన్నాయి. అక్కడ చెత్త వేయడానికి అవకాశం లేకపోవడంతో నేరుగా గెడ్డలో పడేస్తున్నారు. దీంతో చెత్త గుట్టగా పేరుకుపోయింది. ముఖ్యంగా గెడ్డకు సమీపంలో గల ఓ విద్యా సంస్థ హాస్టల్ కూడా నిర్వహిస్తోంది. దీంతో వారు వ్యర్థాలతోపాటు ప్లాస్టిక్ సంచులను గుట్టలుగా వేస్తున్నారు. దీనివల్ల దుర్వాసన వ్యాపించడంతోపాటు నీరు కలుషితమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను విచ్చలవిడిగా పడేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**మధురవాడ:** మారికవలస జాతీ య రహదారి వద్ద ప్రమాదకరంగా ఉన్న ఆర్‌జీకే పాత కాలనీ – కొత్త కాలనీల మధ్య సర్వీసు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, పనులు తక్షణమే ప్రారంభించాలని మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్ కోరారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, గెడ్డను ఆనుకుని కాలువ కూడా నిర్మించాలని నాయకులు జీఎస్ రెడ్డి, మోహన్‌రావు, రుషికేష్, గాయత్రి, కావ్య, సీత, అంబటి లక్ష్మి, శ్రీనివాసరెడ్డి తదితరులు మధురవాడ జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మిని కోరారు. ఈ మేరకు అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో జెడ్సీ పర్యటించారు.

మారికవలస ఆర్‌జీకే కొత్త కాలనీలో పార్కు పనులు, సర్వీసు రోడ్డు నిర్మించాల్సిన ప్రాంతాన్ని, సాయిరాం కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన కల్యాణ మండపం, మారికవలస గ్రామంలో చేపట్టాల్సిన రోడ్డు పనులను పరిశీలించారు. సాయిరాం కాలనీ ఫేజ్ – 1లో గల 9, 10 వీధుల కనెక్టింగ్ డ్రెయిన్, కల్యాణ మండపం పనులు పూర్తి చేయాలని, కొండ పక్కన రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ముచ్చు రామారావు, రామునాయుడు, శ్యామలరావు, యోగేష్, జోజిబాబు, పాత్రుడు, గోపాల్‌నాయుడు, మన్మథరావు, దువ్వి చిన్న, రామకృష్ణ తదితరులు కోరారు. వీటిపై చర్యలు చేపడతామని జెడ్సీ కనక మహాలక్ష్మి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన పార్కుల ఆధునికీకరణ



శివాజీపార్కులో పనులు పరిశీలిస్తున్న కమిషనర్

**డాబాగార్డెన్స్:** నగరంలో చేపడతున్న పార్కుల ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం జోన్-3 పరిధిలో శివాజీ పార్కు, తదితర పార్కుల ఆధునికీకరణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శివాజీ పార్కులో చేపడుతున్న ఆధునికీకరణ పనుల్లో వాటర్ ఫౌంటైన్, పెయింటింగ్, లైటింగ్, పచ్చదనం పెంపొందించడం, సందర్శకులు కూర్చునే బల్లల ఏర్పాటు, తాగునీరు, మరుగుదొడ్లు, క్యాంటీన్ వంటి పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పార్కులో పారిశుద్ధ్యం సరిగ్గా నిర్వహించడం లేదని, తాగునీరు, వాకింగ్ ట్రాక్ సరిగ్గా లేవని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, ఆధునికీకరణ పనులు చేపడతున్నామని, అన్ని సమస్యలు పరిష్కరిస్తామని బదులిచ్చారు. పర్యవేక్షక ఇంజినీరు శ్యాంసన్ రాజు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.